

**106**
**ధారావాహిక**

# జాయ సేనాపతి

## చారిత్రక కాల్పనిక నవల


మత్తి భానుమూర్తి ...
99893 71284


**జరిగిన కథ :** విభిన్న కళాకారులను కళాక్షేత్రంద్వారా ఏకంచేసి.. మతయుద్ధాన్ని గెలిచిన ఏకైక పరిపాలకుడు వెలనాడు మండలేశ్వరుడు జాయచోడుడే.. జగన్నాథుడని తెలిశాక యావత్తు వెలనాడు పులకించిపోయింది. అందరూ నిష్క్రమించిన అనంతరం విశ్రాంతిగా శయనతల్పంపై వాలాడు జాయపుడు. అప్పుడే ఎవరో వగరుస్తూ అరుస్తూ పరుగుపరుగున వచ్చి గొల్లెన వద్ద పడిపోయారు. ఆ కలకలం వినిపించగానే లేచి బయటికి వచ్చాడు జాయపుడు. చూస్తే.. పరాశరుడు!

‘‘అరె.. పరాశరా.. ఏమిటి ఏమైంది?’’.

‘‘మహాప్రభో.. మువ్వ.. మువ్వను వాడు మళ్లీ.. నన్ను చావగొట్టి మువ్వను బలవంతంగా ఎత్తుకుపోయాడు. ఈసారి వాడు ఆమెను చంపేస్తాడు మహారాజా.. వదలడు. మువ్వను రక్షించాలి మహారాజా!’’.

వగరుస్తున్నాడు. ఏడుస్తున్నాడు. వణికిపోతున్నాడు పరాశరుడు.

పూరి జగన్నాథాలయం వద్ద నాట్య ప్రదర్శనకు కంకుభట్టు బృందంతో మువ్వను తీసుకుని వెళ్లిన పరాశరుడు ఇప్పుడే కనిపించాడు. పరాశరుని మాటలు అర్థంకాక లిప్తలకాలం కొయ్యబారిపోయాడు. తర్వాత ఉద్రేకంతో మండిపోయాడు.

మరుక్షణం విక్రమపై జాయపుడు, అతని అశ్వంపై పరాశరుడు ఆ రాత్రివేళ నంగెగడ్డ వైపుగా కదిలారు. పోయి పోయి తెలతెల్లవారుతుండగా నంగెగడ్డ చేరారు. ఎవ్వరూ మువ్వను, కపీశను చూసినట్లు చెప్పలేకపోయారు. హంసలదీవివైపు వెళ్లి ఉండవచ్చునని అటుగా గుర్రాలను దూకించారు.

హంసలదీవి చేరారు కానీ, ఎక్కడని వెతకడం?!

మళ్లీ చుట్టు పక్కల గ్రామాలను, గూడెలను, వాడలను వెతికారు. అడిగారు. ఎవ్వరూ ఏమీ చెప్పలేదు. వచ్చి వచ్చి నీరసించిన శరీరాలతో జలదుర్గపు శిథిలకోట వద్ద కూలబడ్డారు. ఇక్కడే గతంలో వాడి మనుషులు వీళ్లిద్దరిపై దాడి చేశారు. ఈసారి కూడా ప్రతీకారంగా వాడు దాడి చేయవచ్చునని ఊహించి జాగరూకతతో ఉన్నారు.

చీకటి ముసురుకుంటున్నది. ఆరోజు పౌర్ణమి.. మెల మెల్లగా పైకి వస్తున్నాడు చంద్రుడు.. నిండు చందమామ. ఇటు సముద్రంపై.. అటు కృష్ణమ్మపై ఓ వింతవెలుగు కురుస్తున్నప్పుడు కింద సముద్రపు ఘోష.. గుండె పగిలేలా ఏడుస్తున్నట్లు.. ఆవలగా కృష్ణమ్మ కొంగు నోట్లో పెట్టుకుని కుమిలిపోతున్నట్లు.. తెలియబోయే విషాదానికి ముందే దృగ్గోచరమవుతున్న బీభత్స వాతావరణం.

‘గతంలోనే వాణ్ని ఖండఖండాలుగా నరికి చిన్నచిన్న ముక్కలుగా చేసి ఈ తీరమంతా చల్లాల్సింది!’..

క్రోధంతో ఊగిపోతున్నాడు జాయపుడు.

‘‘మహారాజా.. జాయా..’’ దూరం నుంచి గావుకేక వేశాడు పరాశరుడు. వాడి చావును అతిహీనంగా ఊహించుకుంటూ పళ్లు పటపట కొరుకుతున్న జాయపుడు తల తిప్పి చివ్వున చూశాడు.

ఆవలగా కృష్ణపాయ వద్ద నుంచి వెర్రిగా కేకలువేస్తూ చేతులు విహల్వంగా ఊపుతూ.. చేతిలో ఏదో పట్టుకుని గందరగోళంగా కిందా మీదా అవుతూ దుఃఖిస్తూ.. కనిపిస్తున్న పరాశరుని వద్దకు పరుగుపెట్టాడు. అతని చేతిలో తాళపత్రాల ముక్కలు. వాటినే చూస్తూ.. మళ్లీ నీటిలోకి చూస్తూ.. గుండేలు పగిలేలా ఏడుస్తున్నాడు.

‘‘ఏమైంది పరాశరా.. ఏమిటా ముక్కలు.. ఏమైంది.. చెప్పు.. చెప్పు!’’.

కీడు శంకించగా ధైర్యం విలోలంబయినప్పటి కీచక గొంతు.

‘‘ఇక్కడే ఎక్కడో మువ్వ..’’ అంటూ..

‘‘మువ్వా.. మువ్వా..’’ అని గొంతెత్తి పిలుస్తూ, అరుస్తూ మెలికలు తిరిగిపోతున్నాడు పరాశరుడు.

మువ్వను చంపేశాడన్న భావన బలపడుతున్నది.